# సుదినం ★

రచన
శ్రీ గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి

తెల్లవారింది. అంధకారమంతరించింది. తెల్లని వెలుగు ప్రపంచాన్నావరిస్తున్నది. కండ్లను మూసికొని నిద్రపోతూన్న ప్రజలందరూ కండ్లు తెరిచారు. రాత్రి మూచిన చీకటి లేదు. మటుమాయమై పోయింది. వాళ్ళంతా ఆ తెల్లని వెలుగును చూచారు కండ్లను మిరుమిట్లు గొల్పుతోండా వెలుతురు. నీటి శయ్యపై విశ్రమించి మేల్కొంచిన తమ్ములన్నీకూడా ఆ నూతనమైన వెలుగును చూచాయి. ఆ నవీనమైన గాడ్పులు వాటికి కూర్చిన ఆనందాన్నెవరు వర్ణిస్తారు?

ఆ ప్రాతఃకాలం—ఆ వెలుగు—ఆ గాడ్పులు—ఆ పద్మముల నాశ్రయించియున్న ముత్యములు—ఆ ప్రకృతి—ఆ అంతా! ఇంకెందుకు ప్రకృతంతా! నూతనం! నవీనం! పురాతనపు అజ్ఞానాంధకారాన్ని నవీనమైన ఉదయజ్ఞాన భానుడి కిరణాలు రూపు మాపాయి.

తెల్లవారటంవల్ల అందరు లేచి ఎవరిపనులు వారు చేసుకుంటున్నారు. ప్రపంచమంతా లేచింది. కాబట్టి, నా వాడుకకు (అంటే ఎనిమిది గంటలయి, "కాఫీ అయిందిరా అబ్బాయీ" అనేదాక లేవకపోవటం) వ్యతిరేకంగా తొందరగానే మేల్కొవలసివచ్చింది. లేచాను. నూతనమైన కళతోను, నూతనమైన శోభతోను వెలుగొందుతున్న మా వీధిని చూచాను. ఆ వీధి—పచ్చని మామిడాకు తోరణాలతోను, రంగురంగుల కాగితాలతోను — అక్కడక్కడ ఆ గోళమార్గంలో "భారతమాతకి జై", మహాత్మాకి జై" అని వ్రాసి ఉన్నాయి. ఇలా నూతనశోభ వచ్చింది మా వూరికి.

ఇదంతా చూచాను. నా కేమీ అర్థం కాలేదు. ఎందుకాయింత అలంకారం? అని అనుకున్నా. సరే ఏపాటు తప్పినా సాపాటు తప్పదు. త్రాగుడు కలవాడైన వాణ్ణి కాబట్టి (మన కాఫీయే లెండి) ఆ గుక్కెడు నీళ్లను త్రాగి వాకిట్లోకి రాబోయేసరికి "మూర్తీ మూర్తీ" అనే పిలుపు వచ్చింది. ఇతరడెవరో కాదు. మా సహాధ్యాయి, వేణు. పెద్ద మారకరాయు కాబట్టి, అలా గాకరు కాంచుపడిగాను. "మన ఊరికి ఒకాయన వస్తున్నాడురా" అన్నాడు.

నే నతిపటోటి ఆశ్చర్యంగా "ఒకళ్లేమిటి. ఎందరో వస్తారు. ఎందరో పోతారు. ఒకళ్లొస్తే ఏం ఇద్దరొస్తేఏం" అన్నాను.

"అది కాదోయ్ వెఱ్ఱి వెంకప్పా! ఎవరో వస్తారంటే మనకేం. అది కాదు. ఒకళ్లొస్తారంటే ఏ మాత్రం విశేషం లేకుండా అంటానుట్రా గాంధీజీ మద్రాస్ వెళ్లుతున్నాడు" అని అతడింకా పూర్తి చెయ్యకుండానే "మద్రాసు వెళ్లితే మనకేం లాభం? మన ఊళ్లో ఉంటేగా ఒక రోజైనా?" అని అన్నా.

"పూర్తిగా వినకుండానే నన్ను మధ్యలో ఆపితే ఎట్లా? గాంధీజీ మన ఊళ్లో ఆగట్ట. ఇక్కడికి రెండు మైళ్ల దూరంలో ఆగుతాట్ట."

"మనం వెళ్లాలా తప్పకుండా"

"తప్పకుండా వెళ్దాంరా. మన స్టూడెంట్సందరు వెళ్తారు"

అని కాలేజీ టైముకు మామూలుగా బయల్దేరుదామన్నాడు. ఇప్పుడు తెలిసింది నాకు ప్రొద్దున చూచిన అలంకార దృశ్యాని కర్థం.

10 గంటలయింది. మా అమ్మ దగ్గరికివెళ్లి "వంటయిందా? త్వరగా పోవాలి. గాంధీమహాత్ముడు వస్తున్నాట్ట. పోయి చూడాలి" అన్నా. మన అమ్మలందరు చెప్పే మామూలు వాక్యాన్నే మా అమ్మ పల్కింది. "అప్పుడే ఎలాగవుతుందిరా అబ్బాయి! ఇంకా తొమ్మిది కాలేదు గదా!" అని అంది.

ఎలాగైతేనేం భోజనం చెయ్యకుండానే వెళ్లాం. వేణు, నేను బయల్దేరాం. ట్రంక్ రోడ్ గుండా వెళ్దామనుకున్నాం. 'ట్రంక్ రోడ్' అంటే ట్రంక్ పెట్టెలుండే రోడ్డని కానీ ఏమీ కాదు. మన గ్రాండ్ ట్రంక్ రోడ్డన్న మాట అక్కడ ఎక్కడ చూచినా జన సమ్మర్దంగానే ఉంది. అంగళ్లన్నీ మూయబడ్డాయి. ఎవరు మాట్లాడినా మహాత్ముని మాటే. అందరు 'దేశసేవ'ను గూర్చి మాటాడేవారే. అందరు దేశసేవకులే. అందరు రాజకీయాన్ని గురించి ఉపన్యసించేవారే. అందరు రాజకీయ వేత్తలే. "దేశసేవ" అన్నా "రాజకీయం" అన్నా యీ రెండింటిలో ఏ ఒక్క దాని

కూడా అర్థం తెలీదు. కాని అందరు రాజకీయ వేత్తలే. అందరు దేశసేవకులే. గాంధీజీ అంటే ఎవరు? అతని తత్వమేమిటి? అనేది కూడా తెలియనివారే చాల మంది. గాంధీజీ అంటే ఎవరో ఆంగ్లేయుడనో అతడే కార్యార్థిగానో హిందూదేశమునకు వచ్చెనని అనుకొనే వాళ్లుకూడా ఉండకపోరు మనలో. అంటే నీవూ, నేనూ అన్నమాట. నిరక్షరాస్యులనే గాదు. చదివిన వాళ్లల్లోగూడ యిలాంటి వాళ్లున్నారు. కానీ అందరు అతన్ని గూర్చే మాటాడటం!

అడుగడుగు, అత్యుత్సాహంగా నడుస్తున్నాం. గమ్యస్థానం చేరువయే కొద్దీ మరింత కుతూహలం—ఆయన్ని చూడాలని ఆశ. 11 గంటలయే సరికి మహాత్ముడాగే ప్రదేశాన్ని చేరుకున్నాం. గాంధీజీ అయిదు నిమిషాలక్కడ ఆగుతాడు. ఆయనుండేది క్షణమాత్ర మయినా అలంకారం మటుకు తక్కువ కాలేదు. రైల్వేలైన్సుకు ప్రక్కనే ఒక ప్లాట్ ఫామ్ చెక్కలతో కట్టబడి ఉంది. ఆ ప్లాట్ ఫామ్ పైన కొందరు స్థానిక కాంగ్రెస్ నాయకులు కూచున్నారు. అక్కడనే ఒక లౌడ్ స్పీకర్‌ను అమర్చారు.——చాలా బాగా అలంకరించారు. కాంగ్రెస్ జండాలు ఆకాశవీధిలో ఎగురుతున్నాయి. వీటికితోడు అక్కడెవరో పెద్ద గొంతుకతో "కాంగ్రెసు జెండా" అనే పాటను పాడుతున్నారు. స్టూడెంట్స్ కాంగ్రెస్ అంతా హాజరైంది. ఇంకా వాలంటీర్లు చాలామంది వచ్చారు. వాళ్లందరు ప్రజలను వరసల్లో కూచోబెడుతున్నారు. ఇసుక వేస్తే రాలని జన సమూహం! ఆ దృశ్యాన్ని చూచే సరికి దైవారాధన కన్న మనుజారాధన ఎక్కువైందే అనిపించిది. నిజమే! దైవాతీతుడు కాబట్టే మానవుణ్ణారాధిస్తున్నారు. అక్కడ అందరి కంటె పల్లె జన మెక్కువ. అక్కడ మా సహాధ్యాయులు అందరూ హాజర్! అవును మటి ప్రపంచమంతా విద్యార్థులేగా. స్టూడెంట్సే దేనికైనా సమర్థులు. త్యాగం, దేశసేవ వారి ఆశయాలు. వారి (అంటే చాలా మంది) ఆశయాలు స్వార్థశూన్యం, పరార్థప్రదానాలైనవి. ఎవరున్నా ఉండక పోయినా వీళ్లుమటుకు మానరు.

ఇలాగే గల్లంతుగా ఉంది. సూర్యుడు తన పీఠాన్ని సంపూర్ణంగా ఎక్కాడు. అక్కడ్నుంచీ యీ అల్లర్నం ఆలకిస్తున్నాడు. తలలన్నీ ఎండలో మాడుతున్నాయి. కానీ కొందరు మాత్రము గాంధీటోపీలను పెట్టుకున్నారు. వారు ఖద్దరును ధరించటంవల్ల కాంగ్రెసు వారమనుకుంటారు. తల పైనున్న టోపి వారికి ప్రధానం. లోనున్న ఆశయాలు, ఆలోచనలు కావు! సరే, ఎలాగైతేనేం 12 గంటలయింది—12-30 అయింది. అప్పుడే అక్కడున్న సిగ్నల్ చెక్క వంగింది. ఇక రైలొస్తోందిగదా అని పెద్ద గోల ప్రారంభమయింది. అందరికీ ఆ మహనీయుణ్ణి చూడాలనేగా! ఇంతలో రైలొచ్చింది. అక్కడ ఆగలేదు. అందరు ఆశ్చర్యపోయారు. అది ఢిల్లీ ఎక్స్‌ప్రెస్! మా కందరికీ నవ్వాగలేదు. మిన్నుముట్టిన ఆశలన్ని ఒక్కసారి మంటి నంటాయి. చాలమంది ఉపన్యాసాలు, కొందరు పాటలు, కొందరు పద్యాలు అన్నీ పాడారు.

మళ్లీ రైలు శబ్దం అయింది. పొగలను చిమ్ముకుంటూ మెల్లిగా ఆ పొగబండి ఎప్పుడూ ఆగని, చోట యీ దినం ఆగింది. అదే మరి! ఆ దినం నూతన వెలుగుతో వెలుగుతున్నదన్నానుగా! ఆ టెంపొరరి ప్లాట్ ఫారమ్ ముందర ఆగిందా రైలు. ప్యారీలాల్ మొదలైనవారి సహాయాన ఆ మహనీయుడు రైలునుండి దిగాడు. ఆయన నిజంగా మహాత్ముడే! ఈ బిరుదు ఆయన కీయటంలో ప్రజ వెఱ్ఱిది కాదు. ఆయన యొక్క భౌతిక శరీరంగూడ పావనమైనదే. తెల్లని శరీర చ్ఛాయ—ఆధవళిత్వముతో ఏకమయే ఆయన స్వదేశీ (స్వహస్తపు) దుస్తులు—ఆ తెల్లని సులోచనాలు అంతా పవిత్రత! "అఖిల పావన పుంజంబునబ్జభవుడు మెలతగా వీని యందు నిర్మించె నొక్కొ"! ఆ మహాత్ముడు తన వాగమృతాన్ని మాకర్ణపుటములపై చిమ్ముతాడను కున్నాం. కాని, మా ఆశ నిరర్థకమే అయింది. ఆయనేమీ లౌడ్ స్పీకర్‌లో మాటాడలేదు. ఆయన ఆనాడు మౌనవ్రతదీక్షలో వున్నాడు. ఆంధ్ర కేసరిగారు ఏవో రెండు మాటలు చెప్పారు. ఇంతలో మా పల్లెకాపులందరు ఆయనమీదికి తోసుకుంటున్నారు. అల్లకల్లోలమయింది. ఆయన తిరిగి, 5 నిమిషాలు కాకుండానే రైలెక్కారు. గార్డ్ పచ్చ జెండా చూపించాడు. అందరికి గార్డ్ మీద కోప మొచ్చింది. ఇలా అందరి ఆశలు తీరకముందే మా దృక్పథంలోనుంచి తప్పించుకుపోయాడు.

భారత దేశపు భాగ్యం మా కండ్లలో పడటం—వెంటనే వెళ్లిపోవటం—రెండు ఒకే మాటు సంభవించాయి—

ఆయన మాటలు వినడానికి నోచుకోపోతేనేం?

మహనీయుని దర్శనభాగ్యం లభించింది...సుదినమే!

★